
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పెద్దపల్లి జిల్లా వార్తలు

3★

బుధవారం 31 జూలై 2024

కోల్ ఇండియా స్థాయి వేతనాలు ఇవ్వాలి 6లో..

చెడు వ్యసనాలకు బానిస కావద్దు - మంథని సీఐ 6లో..

- సాంకేతిక కారణాలతో కొందరికి కాని రుణ మాఫీ
- బ్యాంకులు, వ్యవసాయ కార్యాలయాల చుట్టూ రైతుల ప్రదక్షిణలు..
- హెల్ప్‌లైన్ కేంద్రాన్ని సంప్రదిస్తున్న రైతులు
- 30 అంశాల వల్ల రుణ మాఫీ కాలేదని గుర్తింపు



అన్నదాతల్లో ఆందోళన

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

రాష్ట్ర ప్రభుత్వం అమల్లోకి తీసుకవచ్చిన రెండు లక్షల రూపాయల వరకు రైతులకు రుణ మాఫీ పథకం సాంకేతిక కారణాల వల్ల పలువురికి లబ్ధి చేకూరడం లేదు. దీంతో సదరు రైతులు వ్యవసాయ కార్యాలయాల చుట్టూ, బ్యాంకుల చుట్టూ తిరుగుతూ ఆందోళన చెందుతున్నారు. వారి సమస్యలను పరిష్కరించేందుకు కలెక్టరేట్ కార్యాలయంలో వ్యవసాయ శాఖ హెల్ప్‌లైన్ కేంద్రాన్ని ఏర్పాటు చేసి వారి సందేహాలను తీరుస్తున్నారు. రుణ మాఫీ కానీ రైతులకు ఏ కారణం చేత రుణ మాఫీ కాలేదనే అంశాన్ని గుర్తించారు. ఇలా 30 అంశాలను గుర్తించి రుణ మాఫీ అయ్యే విధంగా ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు సమాచారాన్ని పంపిస్తున్నారు. మొదటి విడతలో లక్ష రూపాయల వరకు 29,724 మంది రైతులకు 149 కోట్ల 42 లక్షల 22 వేల 297 రూపాయలు మాఫీ అయ్యింది. ఇందులో ఇప్పటి వరకు 25 వేల మంది రైతుల వరకు వారి ఖాతాల్లో జమ కాగా, కొందరికీ సాంకేతిక కారణాల వల్ల పడడం లేదు. వీటిని సవరించేందుకు అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. వీరికే గాకుండా లక్ష

డేటా అనుసంధానంతో..

ఇండియన్ బ్యాంకు ద్వారా రైతులకు ఇచ్చిన రుణాల డేటాలో సమస్య తలెత్తడంతో ఆ బ్యాంకులో లక్ష వరకు రుణాలు తీసుకున్న ఏ ఒక్క రైతు ఖాతాలో కూడా రుణ మాఫీ సొమ్ము జమ కాలేదని అధికారులు గుర్తించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధాని కిసాన్ సమ్మాన్ నిధి యోజన పథకం ద్వారా ఆదాయపు పన్ను చెల్లింపుదారులకు, ప్రభుత్వ ఉద్యోగులకు పెట్టుబడి సాయాన్ని అందించడం లేదు. ఆ పథకం ద్వారా లబ్ధిపొందుతున్న రైతుల డేటాతో రుణ మాఫీ పథకానికి ప్రభుత్వం అనుసంధానం చేయడం వల్ల ప్రభుత్వ ఉద్యోగులకు, ఆదాయ పన్ను చెల్లింపుదారులకు రుణ మాఫీ జరగడం లేదు. కుటుంబం మొత్తానికి 2 లక్షల రూపాయల వరకు రుణ మాఫీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. మొదటి విడతలో లక్ష రూపాయల వరకు రుణ మాఫీ చేసినప్పుడు, కుటుంబ సభ్యుల డేటాతో అనుసంధానం చేసినప్పుడు 2 లక్షల లోపు కుటుంబ సభ్యులు రుణాలు కలిగి ఉన్నా కూడా లక్ష వరకే రుణ మాఫీ కాగా, కొందరికి రుణ మాఫీ కాలేదు. తమకు రుణ మాఫీ అవుతుందా, లేదా అని సదరు రైతులు ఆందోళన చెందుతున్నారు. అలాగే గత ఏడాది పంట రుణం పొంది, ఈ ఏడాది వర్షాకాలం సీజన్ ప్రారంభంలో రుణాలు చెల్లించి తిరిగి పంట రుణాలు పొందిన రైతులకు రుణ మాఫీ వర్తించడం లేదు. దీంతో సదరు రైతులు లబోదిబోమని మొత్తుకుంటున్నారు. తాము సకాలంలో రుణాలు చెల్లిస్తే తమకెందుకు రుణ మాఫీ చేయరని సదరు రైతులు ప్రశ్నిస్తున్నారు. రెండో విడతలో లక్షా 50 వేల రూపాయల వరకు జిల్లాలో 13,238 మంది రైతులకు 122 కోట్ల 43 లక్షల 26 వేల 652 రూపాయల మాఫీ చేశారు. మంగళవారం నుంచి ఆ డబ్బులను రైతుల ఖాతాల్లో జమ చేయడం ప్రారంభించారు. ఇందులో కూడా పలువురి రైతుల ఖాతాల్లో సాంకేతిక సమస్యలతో డబ్బులు పడలేదని తెలుస్తున్నది. అర్హతగల రైతులందరికీ రుణమాఫీని వర్తింపజేయాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఈ విషయమై జిల్లా వ్యవసాయ శాఖాధికారి దోమ ఆదిరెడ్డిని 'ఆంధ్రజ్యోతి' సంప్రదించగా సాంకేతిక కారణాల వల్ల మొదటి విడతలో కొంత మంది రైతులకు రుణ మాఫీ కానట్లు తమ దృష్టికి వచ్చిందని, అలాంటి వారందరినీ బ్యాంకుల వారీగా గుర్తించి ప్రభుత్వానికి నివేదిక పంపిస్తున్నామని చెప్పారు.

రూపాయల వరకు తమకు అర్హత ఉండి కూడా రుణ మాఫీ కాలేదని గగ్గోలు పెడుతున్నారు. అలాంటి వాళ్లు హెల్ప్‌లైన్‌కు ఫోన్లు చేస్తున్నారు. ఈనెల 27వ తేదీ వరకు హెల్ప్‌లైన్‌కు 510 మంది రైతులు ఫోన్లు చేశారు. వీళ్లేగాకుండా పలువురు రైతులు నేరుగా వ్యవసాయ శాఖాధికారులు, బ్యాంకు అధికారులను కలుస్తున్నారు. సరైన ఆధార్ నంబర్ లేకపోవడం, ఆన్‌లైన్‌లో సంబంధిత రైతుల డేటా లేకపోవడం, ఆధార్‌కార్డులో ఉన్న పేరు, రుణ ఖాతాలో ఉన్న పేరు వేరుగా ఉండడం, కుటుంబ సభ్యుల నిర్ధారణ కాకపోవడం వల్ల 136 మంది రైతులకు రుణ మాఫీ కాలేదు. కుటుంబ సభ్యుల నిర్ధారణ చేయాల్సి ఉండడంతో పాటు కుటుంబంలో మినహాయింపులేని ప్రభుత్వ ఉద్యోగి ఉండడం వల్ల కొందరికి రుణ మాఫీ కాలేదు. కుటుంబంలో సర్వీస్ పింఛన్‌దారులు ఉండడం, పట్టాదారు పాసుపుస్తకాలు లేని వాళ్లు, పట్టాదారు పాసు పుస్తకం లేకపోవడంతో పాటు కుటుంబ సభ్యుల నిర్ధారణ జరగ పోవడం, కటాఫ్ డేట్ నాటికి మంజూరైన రుణం కంటే వడ్డీ ఎక్కువగా ఉన్న వాళ్లకు కూడా రుణ మాఫీ జరగలేదు. ఇలా వివిధ కారణాల వల్ల రుణ మాఫీ కాలేదని అధికారులు గుర్తించారు.

రెండు లక్షల రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్‌దే..

- బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులకు అన్యాయం..

- అసెంబ్లీలో పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లి, జూలై 30(ఆంధ్రజ్యోతి): దేశంలోనే రైతులకు ఏకకాలంలో 2 లక్షల రూపాయల వరకు రుణమాఫీ చేసిన చరిత్ర ఏ రాష్ట్రంలో లేదని, ఆ ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా మంగళవారం ఆయన బడ్జెట్‌పై ప్రసంగించారు. గత ఏడాది వరంగల్ సభలో కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీ ప్రకటించిన రైతు డిక్లరేషన్‌లో భాగంగా 2లక్షల రూపాయల వరకు రుణమాఫీ చేస్తామని ప్రకటించిన హామీకి కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతులకు రుణమాఫీ చేసేందుకు శ్రమించారని, వారికి ధన్యవాదాలు తెలిపారు. గతు ప్రభుత్వ హయాంలో రైతులకు తీరని అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు లక్ష రూపాయల వరకు రుణమాఫీ చేస్తామని చెప్పి నాలుగు విడుదల వేసిన డబ్బులు వడ్డీలకే సరిపోయాయన్నారు. రెండవసారి అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా రుణమాఫీ చేస్తామని చెప్పి అసెంబ్లీ ఎన్నికలు సమీపించే సమయంలో కొంతమందికే రుణమాఫీ చేశారని అనేక మంది రైతులకు రుణమాఫీ చేయలేదని దీంతో రైతులు అప్పుల పాలయ్యారని విమర్శించారు. గతఏడాది యాసంగి సీజన్లో పెద్దపల్లి జిల్లాలో కురిసిన వర్షాలకు అనేక మంది రైతులు పంట నష్టపోయారని, 6కోట్ల 90లక్షల రూపాయలు మాత్రమే పరిహారాన్ని అందజేసి, మిగతా రైతులకు రావాల్సిన 21కోట్ల రూపాయల పరిహారాన్ని అందజేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రుణమాఫీ విషయంలో ప్రభుత్వం స్పష్టంగా డిసెంబర్ 9నాటికి తీసుకున్న రుణాలపై వడ్డీతో సహా చెల్లిస్తామని ప్రకటించినదని వివరించారు. అయితే మొత్తానికి వడ్డీ చెల్లించడం లేదని ప్రతిపక్ష నేతలు అవగాహన రాహిత్యంలో మాట్లాడడం సరైనది కాదని హితవు పలికారు. పంటలసాగు విషయంలో బీఆర్ఎస్, భారతీయ జనతా పార్టీలు రైతులను ఇబ్బందులకు గురిచేశాయన్నారు. దొడ్డు బియ్యం తీసుకోబోమని కేంద్ర ప్రభుత్వం చెబితే, సన్న వడ్లు మాత్రమే పండించాలని, పత్తి పంట వేయవద్దని రాష్ట్ర ప్రభుత్వం చెప్పి రైతులను అయోమయానికి గురిచేశాయన్నారు. రైతులకు మంచి చేస్తే ఏ ప్రభుత్వాన్ని అయినా ఆశీర్వదిస్తారని, కాంగ్రెస్ ప్రభుత్వంపై రైతుల్లో విశ్వాసం నెలకొందని చెప్పారు. రుణమాఫీ విషయంలో ఎక్కడైనా అవాంతరాలు తలెత్తితే వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకువస్తే సవరించి సదరు రైతులకు న్యాయం చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రతిపక్షాలకు సూచించారు.

రామగుండంలో 800మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేయండి

- అసెంబ్లీలో ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

గోదావరిఖని, జూలై 30: రామగుండంలో 800మెగావాట్ల విద్యుత్‌ప్లాంట్‌ను ఏర్పాటు చేసి రామగుండానికి పూర్వవైభవం తీసుకురావాలని ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్‌ఠాకూర్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. మంగళవారం అసెంబ్లీలో ఆయన పలు అంశాలపై మాట్లాడారు. నిజాం పాలనలో 2మెగావాట్ల నుంచి మొదలైన బీ పవర్‌హౌస్ నేడు 62.5మెగావాట్ల విద్యుత్ ప్లాంట్‌గా అవతరించిందని, గత పాలకుల నిర్లక్ష్యం వల్ల పవర్‌హౌస్ చీకటిమయం అయ్యిందని, రామగుండంలో ఓపెన్‌కాస్టులు రాకుండా కుర్చీ వేసుకుని కూర్చుంటానని ఆనాడు ముఖ్యమంత్రి కేసీఆర్ చెప్పారని, కానీ నేడు రామగుండం బొంతల గడ్డగా మారిందన్నారు. రామగుండంలో జెన్‌కో పవర్‌ప్లాంట్‌ను ఎత్తివేయడానికి ప్రయత్నిస్తున్నారని, దీని స్థానంలో 800మెగావాట్ల విద్యుత్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని, నీరు, బొగ్గు ఉన్న ఈ ప్రాంతంలో పవర్‌ప్లాంట్ ఏర్పాటు చేయకుండా ఏమి లేని యాదాద్రిలో పవర్‌ప్లాంట్‌ను ఏర్పాటు చేయడాన్ని ఆయన తప్పుబట్టారు. పత్తిపాక రిజర్వాయర్‌తో ఎల్లంపల్లి, అంతర్గాం, పాలకుర్తి లిఫ్టు పని పూర్తిచేస్తే ఉమ్మడి మండలాల్లో భూములు సస్యశ్యామలం అవుతాయని, ఈ పనులను వెంటనే ప్రారంభించాలని ఆయన కోరారు.

కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను వెంటనే అమలుచేయాలి

- కలెక్టరేట్ ఎదుట బీజేపీ ఆధ్వర్యంలో నిరసన



కలెక్టరేట్‌లో నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

పెద్దపల్లి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సందర్భంగా కామారెడ్డి సభలో కాంగ్రెస్ ఇచ్చిన బీసీ డిక్లరేషన్ హామీని వెంటనే అమలు చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం పార్టీ ఆధ్వర్యంలో కలెక్టరేటు ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు బీజేపీ నాయకులు మాట్లాడుతూ తెలంగాణ ప్రజలను దొంగ హామీలతో మభ్యపెట్టిన కాంగ్రెస్ పార్టీకి అధికారంలో కొనసాగే అర్హతలేదని మండిపడ్డారు. కాంగ్రెస్‌రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెటులో సైతం బీసీలకు కేవలం 9వేల 200కోట్లు మాత్రమే కేటాయించి అవమానించిందని ఆరోపించారు. 42శాతానికి బీసీ రిజర్వేషన్లు పెంచి స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రాతినిధ్యం పెంచేలా చర్యలు తీసుకోవాలని, రూ.50వేల కోట్లు బడ్జెటులో కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. కామారెడ్డిలో ఇచ్చిన హామీలు నెరవేర్చేవరకు ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు. అనంతరం అదనపు కలెక్టరు కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. ఈ నిరసనలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శిలారపు పర్వతాలు, బీజేపీ రామగుండం ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి, మేరుగు హనుమంతు గౌడ్, ఆరుముళ్ళ పోశం, కావేటి రాజగోపాల్, మేకల శ్రీనివాస్, కందుల పోశం, ఈర్ల శంకర్, గుడ్ల సతీష్, గాదాసి సతీష్, కుక్క వంశీ, సోడాబాబు, పిట్ట భాస్కర్, వివిధ మండలాల అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్టీసీ ప్రయాణికులను సురక్షితంగా గమ్య స్థానాలకు చేర్చాలి

- ప్రమాద రహిత డ్రైవర్లను సన్మానించిన ట్రాఫిక్ సీఐ



ప్రమాద రహిత డ్రైవర్లను సన్మానిస్తున్న సీఐ రాజేంద్రప్రసాద్

కళ్యాణ్‌నగర్, జూలై 30: ఆర్టీసీ ప్రయాణికులను సురక్షితంగా డ్రైవర్లు గమ్య స్థానాలకు చేర్చాలని రామగుండం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేంద్రప్రసాద్ అన్నారు. మంగళవారం గోదావరిఖని ఆర్టీసీ డిపోలో నిర్వహించిన ప్రమాద రహిత వారోత్సవాల ముగింపు సందర్భంగా డిపోలో 29 సంవత్సరాలుగా ఆర్‌కే మూర్తి, 28సంవత్సరాలుగా కే భూమయ్య, 26సంవత్సరాలుగా తిరుపతి ఎలాంటి ప్రమాదం లేకుండా బస్సులను నడిపారని, వారిని ఆదర్శంగా తీసుకుని ఇతర డ్రైవర్లు ముందుకు పోవాలని సూచించారు. ప్రమాదాలు జరుగకుండా డ్రైవర్లు ఏకగ్రతగా బస్సులు నడపాలని, ట్రాఫిక్ నియమాలు పాటించాలని, బస్సులను రోడ్లపై అకస్మాత్తుగా నిలుపవద్దని సూచించారు. డిపో మేనేజర్ నాగభూషణం మాట్లాడుతూ గత సంవత్సరంతో పోల్చితే గోదావరిఖని డిపోలో ప్రమాదాల రేటు 0.06 నుంచి 0.02కు తగ్గిందన్నారు. డ్రైవర్లు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తగా బస్సులను నడపాలని సూచించారు. మూర్తి, భూమయ్య, తిరుపతిలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ హరిశేఖర్, అసిస్టెంట్ మేనేజర్ గీత కృష్ణ, అసిస్టెంట్‌ఇంజనీర్ సంధ్యారాణి, సదానందం, ఇంద్రాదేవి, స్వామి పాల్గొన్నారు.

సదరం స్లాట్ బుక్ చేసుకోవాలి : డీఆర్‌డీవో

పెద్దపల్లి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల వైద్య నిర్ధారణ పరీక్షల కోసం ఈనెల 31న బుధవారం ఉదయం 11:35 గంటల నుంచి మీ సేవా కేంద్రాల్లో స్లాట్ బుక్ చేసుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ఆర్ రవీందర్ ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తగా సదరం సర్టిఫికెట్ కావాల్సిన వారు, తాత్కాలిక సదరం సర్టిఫికేట్ ఉన్నవారు రెన్యువల్ కోసం దరఖాస్తులు చేసుకోవాలని, మానసిక అంగవైకల్యం, బుద్ధిమాంద్యం ఉన్నవారు ఆగస్టు 8న నిర్వహించే క్యాంప్ స్లాట్‌కు, దృష్టి లోపం, వినికిడి లోపం ఉన్నవారు ఆగస్టు 22న నిర్వహించే క్యాంప్ స్లాట్‌కు, శారీరక అంగవైకల్యంగలవారు ఆగస్టు 1, ఆగస్టు 29 నాటి క్యాంప్ స్లాట్‌కు జూలై 31న ఉదయం 11:35గంటల నుంచి మీసేవా కేంద్రాల్లో స్లాట్ నమోదు చేసుకోవాలని, స్లాట్ బుకింగ్ అనంతరం మెడికల్ క్యాంపులకు వచ్చే సందర్భంలో దరఖాస్తుదారులు మీసేవ సదరం స్లాట్ బుకింగ్ రసీదుతో పాటు వికలాంగత్వ పరీక్షా కాపీ, ఆధార్‌కార్డు జిరాక్స్ పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, వ్యక్తిగత మెడికల్ రిపోర్టులను తీసుకొని రావాలన్నారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి : డీఎల్‌పీవో

మంథని రూరల్, జూలై 30: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డీఎల్‌పీవో సతీష్ సూచించారు. మండలంలోని గద్దలపల్లి గ్రామాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో జరుగుతున్న సానిటేషన్ పనుల వివరాలను అడిగి తెలుసుకోవడంతో పాటు అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ధర్మారం ప్రధాన రహదారిపై ఉన్న వరద నీటిని తొలగింపచేశారు. నీరు నిల్వకుండా శాశ్వత పరిష్కారం చేయాలని అధికారులకు ఆయన సూచించారు. అనంతరం డీఎల్‌పీవో మాట్లాడుతూ.. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. గ్రామాల్లో ఎప్పటికప్పుడు శానిటేషన్ నిర్వహిస్తూ స్వచ్ఛ గ్రామంగా ఉంచాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పూర్ణచందర్, ఎంపీవో శేషయ్య సూరి పాల్గొన్నారు.

మహిళలు అన్నిరంగాల్లో ముందుండాలి

కోల్‌సిటీటౌన్, జూలై 30: మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని జెండర్ స్పెషలిస్ట్ స్వప్న, ఫైనాన్స్ లిటరసీ స్పెషలిస్ట్ సంధ్యారాణి అన్నారు. జిల్లా మహిళా సాధికరత కేంద్రం ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన 100రోజుల సంకల్ప్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం గోదావరిఖని గణేష్‌నగర్, ద్వారకానగర్‌లలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆడపిల్లలపై లైంగిక వేధింపులు రోజురోజుకు ఎక్కువ అవుతున్నాయన్నారు. ఆడపిల్లలకు భద్రత కరువు అవుతుందని ఇలాంటి దారుణాలు చేసేవారు ఎక్కువగా మన చుట్టే ఉంటారని ఎవరిని నమ్మరాదని, వారితో జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌లపై అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే పిల్లలకు చెప్పాలని, బాలింతలకు తెలియజేయాలన్నారు. ఆడపిల్లల సంఖ్య రోజురోజుకి తగ్గిపోతుందని వారి సంఖ్యను పెంచడానికి కేంద్ర ప్రభుత్వం బేటి బచావో బేటి పడవో పథకం ఏర్పాటు చేశారని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలు ప్రతి మహిళకు పుట్టినిల్లులాంటిదన్నారు. అత్యవసర సమయంలో హెల్ప్‌లైన్ నెంబర్లు 181,100, 112, 1098, 104, 155209 వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు శరీన్, విష్ణుప్రియ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

అర్హులందరికీ 'రుణమాఫీ' అందేలా చర్యలు

- కలెక్టర్ కోయ శ్రీహర్ష - ఫిర్యాదుల నమోదుకు 18005995459 టోల్ ఫ్రీ నంబర్



రుణ మాఫీ చెక్కును రైతులకు అందిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేస్తున్న రుణ మాఫీ పథకం డబ్బులు అర్హులైన రైతుల ఖాతాల్లో జమ అయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని, ఫిర్యాదుల కోసం కలెక్టరేట్‌లో టోల్‌ఫ్రీ నంబర్ 18005995459ను ఏర్పాటు చేశామని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. మంగళవారం అసెంబ్లీ నుంచి సీఎం రేవంత్‌రెడ్డి, మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఇతర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, రాష్ట్ర ఉన్నతాధికారులతో కలిసి రైతు రుణమాఫీ రెండవ విడత నిధుల విడుదల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్‌లో రైతులతో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. రైతు రుణమాఫీ రెండవ విడత నిధుల విడుదల కింద లక్షన్నర వరకు రుణాలు ఉన్న 6లక్షల 40వేల మంది రైతులకు సంబంధించి 6,190 కోట్ల రూపాయలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విడుదల చేశారు. అనంతరం రైతులను ఉద్దేశించి ముఖ్యమంత్రి ప్రసంగించారు. అనంతరం కలెక్టర్ రెండవ విడతలో జిల్లాకు చెందిన 13,238 మంది రైతులకు 122 కోట్ల 43 లక్షల 26 వేల 652 రూపాయల మాఫీ చెక్కును రైతులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు విడతల్లో కలిపి 42,965 మంది రైతులకు 271 కోట్ల రుణమాఫీ సొమ్మును ప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నదని అన్నారు. రుణమాఫీ పథకంపై రైతులు ఫిర్యాదులను నమోదు చేస్తే 30 రోజులలో పరిష్కరిస్తామన్నారు. హెల్ప్‌లైన్ కేంద్రానికి ఇప్పటి వరకు వచ్చిన ఫిర్యాదుల్లో 30 రకాల ఫిర్యాదులు ఉన్నట్లు గుర్తించామని, వాటన్నింటిని పరిష్కరిస్తామని అన్నారు. రేషన్ కార్డు రైతు రుణమాఫీ పథకం అమలుకు తప్పనిసరికాదని, రైతు కుటుంబాన్ని గుర్తించేందుకు ఒక ప్రామాణికంగా మాత్రమే రేషన్ కార్డును వినియోగిస్తున్నామని, భూమి ఉన్న ప్రతి రైతు కుటుంబానికి 2 లక్షల రూపాయల రైతు రుణమాఫీ పథకం అమలు అవుతుందని అన్నారు. అనంతరం రుణమాఫీ సందర్భంగా రైతులు తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఆదిరెడ్డి, ఎల్.డి.ఎం.వెంకటేష్, బ్యాంకర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

లద్నాపూర్ భూ నిర్వాసితులతో ఆర్డీవో సమావేశం



మాట్లాడుతున్న ఆర్డీవో హనుమా నాయక్

మంథని, జూలై 30: రామగిరి మండలం లద్నాపూర్ గ్రామ భూ నిర్వాసితులతో మంథని ఆర్డీవో హనుమానాయక్ మంగళవారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆర్డీవో హనుమానాయక్ మాట్లాడుతూ.. లద్నాపూర్ గ్రామానికి చెందిన 283 మంది భూనిర్వాసితులకు సంబంధించిన కేసు హైకోర్టులో పెండింగ్‌లో ఉందన్నారు. ఈ గ్రామంలోని గృహాలకు మాత్రమే నష్టపరిహారం చెల్లించారని, ఆర్‌అండ్‌ఆర్ పరిహారం చెల్లించరాదని అవార్డులో అప్పటి భూసేకరణ అధికారి రాశారని ఆర్డీవో తెలిపారు. దీనిపై సింగరేణి అధికారులు మాట్లాడుతూ.. లద్నాపూర్ నిర్వాసితులు కోరిన విధంగా ఆర్‌అండ్‌ఆర్ పరిహారం చెల్లించడానికి నిబంధనలు అనుమతించవన్నారు. ఎక్స్‌గ్రేషియాకు ఒప్పుకొని చెల్లించేందుకు అనుమతిస్తే ఉన్నతాధికారులకు తెలియజేస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో ఎస్వోటూ జీఎం రఘుపతి, ఏఎస్వో లక్ష్మీనారాయణ, జూనియర్ ఏస్టేట్ శ్యామల, లద్నాపూర్ గ్రామ కమిటీ సభ్యులు వనం రాంచంద్‌రావు, సభ్యులు పాల్గొన్నారు.

గోదావరిఖనిలో జాతీయ స్థాయి కళోత్సవాలు : ఇప్టా



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కే స్వామి

కళ్యాణ్‌నగర్, జూలై 30: నల్ల వజ్రాల గని గోదావరిఖనిలో ఆగస్టు 10, 11తేదీల్లో జాతీయ స్థాయి కళా ఉత్సవాలను నిర్వహించనున్నట్లు ఇండియన్ పీపుల్ థియేటర్ అసోసియేషన్(ఇప్టా) జాతీయ సమితి నాయకులు కే స్వామి, ప్రముఖ కళాకారుడు మేజిక్ రాజా చెప్పారు. మంగళవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఔత్సాహిక కళాకారులను ప్రోత్సహించడానికి, మరుగున పడుతున్న కళలను వెలికితీయడానికి తారా ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో ప్రఖ్యాతి గాంచిన కళాకారులను ఘనంగా సన్మానించనున్నట్లు చెప్పారు. అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్రీయ అనే వేదికలపై వందలాది మంది కళాకారులను పరిచయం చేసింది తారా ఆర్ట్స్ అకాడమీ అని అన్నారు. ప్రతిష్ఠాత్మక తానా మహాసభల్లో కూడా తారా ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో కళా ప్రదర్శన ఇవ్వడం జరిగిందని, ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సంకె రాజేష్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి ఉత్సవాలను నిర్వహించనున్నట్లు చెప్పారు. మన ఊరి ఘనతను చాటి చెప్పడానికి, సింగరేణి ఖ్యాతిని ప్రపంచానికి తెలియజేయడానికి ఈ కళా ఉత్సవాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. నల్లవజ్రం అనే కీర్తిపురస్కారంతో సత్కరించి వారికి గౌరవం కల్పించనున్నట్లు, నల్ల వజ్రం పేరిట వివిధ రంగాల్లో సేవలందించిన వారికి ఈ పురస్కారాన్ని అందించనున్నట్లు, ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, రామగుండం సీపీ శ్రీనివాస్, మేయర్ బంగి అనీల్‌కుమార్ హాజరవుతారని చెప్పారు.

ఈ విలేకరుల సమావేశంలో మేకల శ్రీధర్, దామెర శంకర్, కనకం రమణయ్య, దయానర్సింగ్, ఇనుముల రాజమౌళి, రాధాకృష్ణ, చంద్రమౌళి, రాజమౌళి, హరి, వెంకట్, అంజయ్య, తిరుమలయ్య తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాల్లో చోరీ

సుల్తానాబాద్, జూలై 30: సుల్తానాబాద్ పట్టణంలోని మద్యం దుకాణాల్లో మంగళవారం దొంగతనాలు జరిగాయి. ఉదయం మద్యం షాపులను తెరువడంతో దొంగలు పడ్డట్టు గుర్తించారు. వెంటనే షాపుల యజమానులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సుల్తానాబాద్ పట్టణంలోని శాస్త్రినగర్‌లోని ఓ వైన్ షాపులో గాలికోసం ఉన్న చిన్న కిటికీని ఊడదీసి లోపలకు దొంగలు దూరారని పెద్దగా మద్యం చోరీ కాలేదని, నగదు డబ్బుల కోసం కౌంటర్లు చెక్ చేశారని కానీ వారికి ఏమీ నగదు దొరకలేదని యజమాని సంతోష్‌రావు తెలిపారు. అలాగే అక్కడే సమీపంలోని ఓ బార్ అండ్ రెస్టారెంట్‌లో సైతం దొంగలు పైకప్పు రేకులు తీసి లోనికి వచ్చారని కౌంటర్‌లో ఉన్న చిల్లర దాదాపు రెండు వేల వరకు తీసుకు వెళ్లారని నిర్వాహకులు నరేష్ తెలిపారు.

సుభాష్‌నగర్‌లో బైక్ చోరీ

సుల్తానాబాద్ పట్టణంలోని సుభాష్‌నగర్‌లో ఎవరూ లేని ఓ ఇంట్లో చోరీ జరిగింది. ఇంట్లో దూరిన దొంగ ఇరవై వేల నగదు చోరీ చేశాడని దాంతో పాటు ఇంటి ఆవరణలో ఉంచిన ద్విచక్ర వాహనాన్ని సైతం ఎత్తుకెళ్లాడని బాధితుడు ఆరేపల్లి బాలరాజు తెలిపారు. తాము ఇంట్లో ఎవరూ లేని విషయాన్ని గమనించి ఈ దొంగతనానికి పాల్పడ్డాడని తెలిపారు. ఈ చోరీ మొత్తం సీసీ కెమెరాలో రికార్డు అయి ఉంది.

జ్వరంతో బాలుడి మృతి

సుల్తానాబాద్, జూలై 30: మూడు రోజులుగా జ్వరంతో బాధపడుతున్న ఓ బాలుడు మంగళవారం మృతిచెందాడు. సుల్తానాబాద్ పట్టణంలోని గడీమహల్‌కు చెందిన సాదిక్-రెహనా దంపతుల పదకొండు నెలల కుమారుడు మూడు రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. రెండు రోజులు పట్టణంలోని ఓ ఆర్ఎంపీ వైద్యుడి వద్ద చికిత్స చేయించారు. జ్వరం తగ్గినట్టే తగ్గి మళ్లీ పెరిగి ఫిట్స్ వచ్చాయి. సోమవారం రాత్రి కుటుంబ సభ్యులు సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యుడి సూచన మేరకు బాలుడిని కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతిచెందాడు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఒకరికి జైలుశిక్ష

కోల్‌సిటీ, జూలై 30: మద్యం సేవించి వాహనం నడిపి రెండవసారి పోలీసులకు పట్టుబడిన కేసులో బామిని భరత్ అనే వ్యక్తికి మంగళవారం గోదావరిఖని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు రెండవ అదనపు న్యాయమూర్తి వెంకటేష్ దుర్వ మూడు రోజుల జైలు శిక్ష విధించారు. మరో 11మందికి రూ.2000చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

గంగాధర, జూలై 30: గంగాధర మండలం మధురానగర్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని డీటీసీఎస్, ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారులు పట్టుకున్నారు. గంగాధర డీటీసీఎస్ ఉష మాట్లాడుతూ మధురానగర్ గ్రామ పరిధిలోని పత్తికుంటపల్లిలోని మామిడితోటలోని ఓ ఇంట్లో అక్రమంగా 40 క్వింటాళ్ల రేసన్ బియ్యం నిల్వ ఉంచినట్లు పక్కా సమాచారం అందింది. మంగళవారం ఎన్‌ఫోర్స్‌మెంటు అధికా రులు, డీటీసీఎస్ బృందం తనిఖీ చేయగా సంచుల్లో నింపిన 40 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుబడినట్లు తెలిపారు. ఇంటిపక్కన ఉన్న కడమంచి రమేష్ మోటర్ సైకిళ్లమీద ఊళ్లలో సేకరించిన రేషన్ బియ్యాన్ని జగిత్యాలకు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. రమేష్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఎల్లంపల్లి నుంచి కొనసాగుతున్న ఎత్తిపోతలు



గాయత్రి పంప్ హౌస్ నుంచి విడుదలవుతున్న నీరు



ఉధృతంగా ప్రవహిస్తున్న గ్రావిటీ కెనాల్

పెద్దపల్లి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి మిడ్ మానేరుకు ఎత్తిపోతల ద్వారా నీటి తరలింపు కొనసాగుతున్నది. మంగళవారం ప్రాజెక్టులోకి వస్తున్న వరద నీరు తగ్గుముఖం పట్టినా కూడా ఎత్తిపోతలను అధికారులు కొనసాగిస్తున్నారు. సాయంత్రం వరకు ప్రాజెక్టులోకి 11,173 క్యూసెక్కుల వరద నీరు వస్తుండగా, ఇందులో కడెం ప్రాజెక్టు నుంచి 3,568 క్యూసెక్కులు, ఎగువ ప్రాంతం నుంచి 7,605 క్యూసెక్కుల నీళ్లు వస్తున్నాయి. మిడ్ మానేరుకు 5 మోటార్ల ద్వారా 15,750 క్యూసెక్కుల నీటిని పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నందిమేడారంలోని నంది పంప్‌హౌస్ ద్వారా గాయత్రి పంప్‌హౌస్‌కు, అక్కడి నుంచి వరద కాలువ ద్వారా మిడ్ మానేరులోకి ఎత్తిపోస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 17.371 టీఎంసీలు ఉన్నాయి.

మిడ్ మానేరుకు కొనసాగుతున్న పంపింగ్

రామడుగు: మండలంలోని లక్ష్మీపూర్ గాయత్రి పంప్‌హౌస్ నుంచి శ్రీ రాజరాజేశ్వర మిడ్ మానేరు జలాశయానికి నాలుగో రోజు కూడా నీటి విడుదల కొనసాగుతుంది. శనివారం 4 బాహుబలి పంపు నుంచి నీటి విడుదల చేసిన అధికారులు మంగళవారం కూడా నీటి విడుదల యధావిధిగా కొనసాగించారు. ఐదు పంపుల ద్వారా 15,750 క్యూసెక్కుల నీరు వరద కాలువ ద్వారా ఎస్ఆర్ఆర్ మిడ్ మానేరు డ్యాంలోకి తరలివెళ్తుంది. డెలివరీ పాయింట్ నుంచి గ్రావిటీ కెనాల్‌లోని ఐదు పంపులు ఒకేసారి విడుదల కావడంతో నీటి ప్రవాహం పెరిగింది. గ్రావిటీ కెనాల్ నుంచి నీటి ప్రవాహం పరవళ్లు తొక్కుతూ వరద కాలువ ద్వారా మిడ్ మానేరుకు తరలిపోతుంది. ఐదు పంపులతో నీటి విడుదల కొనసాగిస్తుండగా అటు గ్రావిటీ కెనాల్ ఇటు వరద కాలువలో నీటి ప్రవాహం కనువిందు చేస్తోంది.

మిడ్ మానేరులో 9టీఎంసీల నీరు

బోయినపల్లి: మండలంలోని మిడ్ మానేరు ప్రాజెక్ట్‌కు గాయత్రి పంప్‌హౌస్ ద్వారా 15,750 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 318 మీటర్లకు 308.46 మీటర్లు, పూర్తి స్థాయి నీటి సామర్థ్యం 27.50 టీఎంసీలకు 9.19 టీఎంసీలు ఉన్నది.

ఎస్సారెస్పీలోకి 22,285 క్యూసెక్కుల నీరు

జగిత్యాల, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ వరద నీరు పెరుగుతోంది. మంగళవారం వరద నీరు చేరుతుండడంతో ప్రాజెక్టు నీటి మట్టం క్రమంగా పెరగుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో పాటు, బాబ్లీ గేట్లు ఎత్తివేయడంతో ఎస్సారెస్పీలోకి 22,285 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 90.323 సామర్థ్యానికి ప్రస్తుతం 35.297 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 76.894 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాగా మిషన్ భగీరథ, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 664 క్యూసెక్కుల నీటిని వదిలారు. జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 30.058 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది.

రుణమాఫీ కార్యక్రమంలో అల్లునూర్ రైతు



హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో సీఎంతో రైతు జాప లక్ష్మారెడ్డి

తిమ్మాపూర్, జూలై30: రైతు రుణామాఫీలో కార్యక్రమంలో భాగంగా 1లక్ష 50వేల వరకు రైతులకు రెండవ విడత నిధుల విడుదల కార్యక్రమాన్ని మంగళవారం హైదారాబాద్‌లోని అసెంబ్లీ ఆవరణలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఇతర జిల్లాల నుంచి వచ్చిన రైతులతో పాటు జాప లక్ష్మారెడ్డి పాల్గొని రైతు కుంటుంబాలకు సీఎం రేవంత్ రెడ్డి అందజేసిన చెక్కును అందుకున్నాడు. తనకు 1లక్ష 22వేల 979రూపాయల రుణమాఫీ అయిందని తెలిపాడు. సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొన్న కార్యక్రమంలో పాల్గొనడం చాలా సంతోషంగా లక్ష్మారెడ్డి పేర్కొన్నారు.

అక్రమంగా ఇంటి మార్పిడి చేసిన వారిపై కేసు

గంగాధర, జూలై30: గంగాధర మండలం కొండన్నపల్లిలో అక్రమంగా ఇంటి మార్పిడి చేసిన వ్యక్తితో పాటు అప్పటి కార్యదర్శిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కిరణ్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కొండన్నపల్లికి చెందిన కడార్ల ఆగయ్యకు ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆగయ్య గతకొన్ని సంవత్సరాల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. ఆగయ్యకు వెంకటాచారి, సత్యనారాణ ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆగయ్యకు గ్రామంలో వారసత్వంగా ఉన్న ఇంటిని ఇద్దరి అన్నదమ్ములకు చెందవలసి ఉండగా సత్యనారాయణ పేరుపై 2018లో అప్పటి కార్యదర్శి మార్పిడి చేశాడు. వెంకటచారి ఫిర్యాదు మేరకు సత్యనారాయణ, అప్పట్లో గ్రామంలో పనిచేసిన కార్యదర్శిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ప్రభుత్వ వైద్యుడిపై దాడి



గాయపడిన వైద్యుడు

కాల్వశ్రీరాంపూర్, జూలై 30: కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న డాక్టర్ మహేందర్ విధులు ముగించుకొని పెద్దపల్లికి వెళ్తుండగా మార్గమధ్యలో గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారు. ఈ దాడిలో డాక్టర్ మహేందర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు వైద్య చికిత్స కోసం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. కాల్వ శ్రీరాంపూర్ ప్రభుత్వాసుపత్రిలో విధులు నిర్వహించి సాయంత్రం తన కారులో పెద్దపెల్లికి వెళుతుండగా మార్గమధ్యలో గుర్తు తెలియని వ్యక్తులు దాడిచేసి పారిపోయినట్లు సమాచారం.

కుక్కను తప్పించబోయి యువకుడికి తీవ్ర గాయాలు

జమ్మికుంట రూరల్, జూలై 30: జమ్మికుంట మండలం గోవిందాపూర్ గ్రామంలో ఓ యువకుడు కుక్కను తప్పించబోయి ద్విచక్రవాహనం మీద నుంచి కింద పడి తీవ్ర గాయాలపాలయ్యాడు. వీణవంక మండలం లస్మక్కపేట గ్రామానికి చెందిన దాసారపు సతీష్ గోవిందాపూర్ గ్రామంలో ఎదురుగా వస్తున్న కుక్కను తప్పించబోయి ప్రమాదవశాత్తు ద్విచక్రవాహనం మీద నుంచి కింద పడ్డాడు. తలకు, కాళ్లకు తీవ్రగాయాలు కాగా, చికిత్స నిమిత్తం 108వాహనంలో జమ్మికుంటలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

గ్రామాల్లో కోతుల బెడద

● దాడుల్లో పలువురికి గాయాలు ● కలెక్టర్‌కు వినతి



గాయపడిన వృద్ధురాలు

కరీంనగర్ రూరల్, జూలై30: కరీంనగర్ మండలంలోని పలు గ్రామాల్లో కోతుల బెడద తీవ్రంగా ఉండటంతో గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని ఎలబోతారం గ్రామంలో సమీపంలో గుట్ట ఉండటంతో కోతుల సంచారం పెరిగింది. అయితే మంగళవారం గ్రామంలోకి ప్రవేశించిన కోతులు పలువురిని గాయపరచగా వారు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. గ్రామానికి చెందిన ఆడెపు మల్లమ్మ, వాసల శేషమ్మ, తుమ్మణవేని లక్ష్మీ, దుబ్బెట భూమక్కలపై దాడి చేశాయి. కోతి కరవడంతో గాయపడిన వాళ్లు కరీంనగర్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్నారు. అయితే గత వారం రోజుల కిందట కూడా పత్తెం శ్రీనివాస్ కూతురు అనన్యపై దాడి చేయగా చిన్నారికి కూడా తీవ్ర గాయాలయ్యాయి. కోతుల బెడద నుంచి కాపాడాలని జాతీయ మానవ హక్కుల కమిటీ జిల్లా అధ్యక్షుడు మాసం సుధాకర్ మంగళవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కోతుల నుంచి ప్రజలను రక్షించేందుకు చర్యలు చేపట్టాలని, మహిళలు చిన్నారులపై దాడి చేస్తున్న కోతులను పట్టుకునేందుకు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

9నుంచి ఎస్‌యూ పీజీ రెండో సెమిస్టర్ పరీక్షలు

గణేశ్‌నగర్, జూలై 30: ఎస్‌యూ పరిధిలోని పీజీ రెండో సెమిస్టర్ పరీక్షలు ఆగస్టు 9నుంచి ప్రారంభం కానున్నట్లు పరీక్షల నియంత్రాణాధికారి డాక్టర్ ఎన్వీ శ్రీరంగప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలను మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నిర్వహిస్తామని పేర్కొన్నారు. పూర్తి వివరాల కోసం www.satavahana.ac.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

● ఎంబీఏ, ఎంసీఏ, పరీక్షలు ఆగస్టు 9 నుంచి 19వ తేదీ వరకు జరగనున్నట్లు పరీక్షల నియంత్రాణాధికారి తెలిపారు. పరీక్ష సమయం మధ్యాహ్నం రెండు గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు ఉంటుందని తెలిపారు.

అటవీభూమిలో సాగును అడ్డుకున్న అధికారులు



గిరిజనులతో మాట్లాడుతున్న అధికారులు

వీర్నపల్లి, జూలై 30: వీర్నపల్లి మండలం భూక్యతండా గ్రామ పరిధిలోని రాశిగుట్ట తండాలో అటవీ భూమిలో గిరిజనులు పత్తి సాగు చేస్తుండగా అధికారులు మంగళవారం అడ్డుకున్నారు. అటవీశాఖ అధికారులు గిరిజనులకు మధ్య తోపులాట జరుగడంతో ఉద్రిక్తతకు దారితీసింది. వివరాలు ఇలా ఉన్నాయి. రాశిగుట్ట తండాలో గత ఐదేళ్లుగా అటవీ భూమిని చదును చేసి పత్తిపంట సాగు చేసుకుంటున్నామని గిరిజనులు తెలిపారు. అదే భూమిలో అటవీశాఖ అధికారులు మొక్కల ప్లాంటేషన్ పనులు చేపట్టడంతో గిరిజనులు మొక్కలను తొలగించారు. ఈ భూములను కొన్ని ఏళ్లుగా తాము సాగు చేసుకుంటున్నామని గిరిజనులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. గిరిజనులు, అధికారులు ఒకరినొకరు తోసేసుకున్నారు. దీంతో కొద్దిసేపు స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు, వీర్నపల్లి అటవీ సెక్షన్ అధికారి రంజిత్‌కుమార్ తన సిబ్బందితో వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు తీసుకున్నారు. ఉద్రిక్తత మధ్య అధికారులు అక్కడి నుంచి వెను దిరిగి వెళ్లిపోయారు. చదును చేసిన అటవీ భూమిలో మొక్కలను ప్లానిటేషన్ చేస్తామన్నారు.

మరమగ్గాల కార్మికులకు పని కల్పించాలి

● గంగాధర ప్రధాన రహదారిపై కార్మికుల ధర్నా



గంగాధర ప్రధాన రహదారిపై ధర్నా చేస్తున్న మగ్గాల కార్మికులు

గంగాధర, జూలై30: గర్షకుర్తి మరమగ్గాల కార్మికులకు పనికల్పించి ఆదుకోవాలని గంగాధర మండలం కురిక్యాల ప్రధాన రహదారిపై గర్షకుర్తి, ఉప్పరమల్యాల, తాడిజెర్రి, రంగరావుపల్లి గ్రామాల మగ్గాల కార్మికులు,సంఘ నేతలు మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ గత ఎనిమిది నెలలుగా మగ్గాలు నడవక పోషణ భారమవుతుందన్నారు. గర్షకుర్తి మగ్గాలకు బతుకమ్మ చీరల ఉత్పత్తి ఆర్డర్లు, గుడ్డ ఉత్పత్తి ఆర్డర్లను ప్రభుత్వం ఇప్పించాలని డిమాండ్ చేశారు. గతంలో ఉత్పత్తి చేసిన బతుకమ్మ చీరల కోట్ల బకాలు నిలిచి పోయాయని ప్రభుత్వం వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. గర్షకుర్తిలో గత ఆరు రోజులుగా ధర్నాలు చేస్తున్న కనీసం ప్రభుత్వం నుండి స్పందన లేదని అన్నారు. మగ్గాల కార్మికులకు తక్షణం పని కల్పించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈసందర్భంగా కురిక్యాల రహదారిపై కార్మికుల ధర్నాతో వాహనాలు భారీగా నిలిచిపోయాయి, ఎస్ఐ కిరణ్‌రెడ్డి ఆధ్వర్యంలో నిరసనకారులను శాంతింపజేసి ధర్నాను విరమింపజేశారు. కార్మికులకు మద్దతు తెలిపిన మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే కార్మికుల డిమాండ్లను నెరవేర్చి చేతినిండా పని కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల మగ్గాల కార్మికులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో రాణించిన విద్యార్థి

రామడుగు, జూలై 30: మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామానికి చెందిన దాసరి దీపక్ అండర్-14 క్రికెట్ టీం తెలంగాణ రాష్ట్రం తరపున జాతీయ స్థాయిలో ఆడి సత్తా చాటాడు. దీంతో పాటు నేపాల్‌లో జరిగిన క్రికెట్ పోటీల్లో ఆల్ రౌండర్‌గా రాణించాడు. ఈ మేరకు ఆటల్లో రాణించిన విద్యార్థిని మాజీ ఎంపీటీసీ ఎడవెల్లి సురేందర్ రెడ్డి, నేచర్ యూత్ క్లబ్ అంబేద్కర్ యువజన సంఘం తరపున శాలువాతో ఘనంగా సత్కారించారు.ఈ కార్యక్రమంలో నేచర్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కాసారపు పరశురాం, బుర్ర శ్రీకాంత్, రేణిగుంట అశోక్ పాల్గొన్నారు.

రూ.7,150 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, జూలై 30: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7,150 పలికింది. మంగళవారం మార్కెట్ యార్డుకు ఒక రైతు 15క్వింటాళ్ల విడి పత్తి విక్రయానికి తీసుకు వచ్చాడు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర రూ.7150 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

ఆర్టీసీకి 'మహాలక్ష్మి'తో ఊపు

● ఉమ్మడి జిల్లాలో రూ.230.72 కోట్ల ఆదాయం



భగత్‌నగర్, జూలై 30: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మహాలక్ష్మి పథకం ద్వారా ఆదాయం 230.72 కోట్ల రూపాయలు సమకూరింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రకటించడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బస్సులన్నీ కిక్కిరిసి పోతున్నాయి. ఆర్టీసీలో ప్రయాణించిన మహిళల కోసం మహాలక్ష్మి పథకం కింద ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు డబ్బులు చెల్లించనుంది. కాంగ్రెస్ ప్రభుత్వం మహాలక్ష్మి పథకం ప్రకటించిన 2023 డిసెంబర్ 9 నుంచి మంగళవారం వరకు మహాలక్ష్మి పథకం కింద 6.35 కోట్ల మంది ప్రయాణించారు. కరీంనగర్ రీజియన్ వ్యాప్తంగా కరీంనగర్-1, కరీంనగర్-2, జగిత్యాల, మెట్‌పల్లి, కోరుట్ల, సిరిసిల్ల, వేములవాడ, గోదావరిఖని, మంథని, హుజూరాబాద్ హుస్నాబాద్ డిపోలు ఉండగా వాటిలో రీజియన్ ఆదాయంలో మొత్తంలో మహాలక్ష్మి ఆదాయం 49.22 శాతంగా ఉండడం విశేషం. మహాలక్ష్మి పథకం అమలు కంటే ముందు 68.13 శాతం ఆక్యుపెన్సీ రేషియా ఉండగా, మహాలక్ష్మి పథకం అమలు తర్వాత 85.33 శాతానికి పెరిగింది. మహాలక్ష్మి పథకం అమలు తర్వాత ప్రయాణికుల సంఖ్య 4.15లక్షలకు పెరగడంతో తెలంగాణరాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు రీజియన్ వ్యాప్తంగా భారీ మొత్తంలో ఆదాయం సమకూరింది.

రద్దీకి అనుగుణంగా బస్సులు

-రీజనల్ మేనేజర్ సుచరిత



తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ రీజియన్ వ్యాప్తంగా ఉన్న 11 డిపోల్లో ఆర్టీసీ బస్సులను రద్దీకి అనుగుణంగా నడిపిస్తున్నాం. మహాలక్ష్మి పథకం అమలు తర్వాత రద్దీని బట్టి అన్ని డిపోల్లో బస్సుల సంఖ్య పెంచాం.ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా సంస్థ ఉద్యోగులంతా కలిసికట్టుగా పనిచేస్తున్నాం. ఆర్టీసీని మరింత బలోపేతం చేస్తాం.

ఆలయాల్లో చోరీకి పాల్పడిన వ్యక్తి అరెస్ట్

● నిందితుడిపై 17 కేసులు ● సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి

ఎల్లారెడ్డిపేట, జూలై 30: పలు ఆలయాల్లో చోరీకి పాల్పడిన కరీంనగర్ రూరల్ మండలం దుర్శేడ్ గ్రామానికి చెందిన బుద్ధుల యుగేందర్‌ను అరెస్ట్ చేసినట్టు సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఎల్లారెడ్డిపేట పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఆయన వివరాలను వెల్లడించారు. నిందితుడి వద్ద నుంచి రూ. వేయి నగదు, దొంగతనాలను వినియోగించిన ఇనుప రాడ్‌ను స్వాధీన పర్చుకున్నామని పేర్కొన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో యుగేందర్‌పై 17 కేసులున్నాయని వివరించారు. డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి వెల్లడించిన వివరాల మేరకు.. కరీంనగర్ రూరల్ మండలం దుర్శేడ్ గ్రామానికి చెందిన బుద్ధుల యుగేందర్ కూలీ పనులు చేయడంతో పాటు వ్యాన్‌లో క్లీనర్‌గా కొనసాగేవాడు. మద్యం, జల్సాలకు అలవాటు పడిన అతడు సులువుగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో చోరీలకు దిగాడు. 2010 నుంచి 2018 వరకు కరీంనగర్ పట్టణంలో పలు దొంగతనాలను పాల్పడి పోలీసులకు చిక్కాడు. అతన్ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. జైలు జీవితం గడిపి బయటకు వచ్చిన యుగేందర్ ఈ నెల 26న ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట మండలాల్లోని రాచర్లబొప్పాపూర్, గోరంట్యాల గ్రామంలోని పెద్దమ్మ, ఎల్లమ్మ, సాయిబాబా ఆలయాల్లో చోరీకి పాల్పడ్డాడు. కేసు నమోదుచేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులకు ఈ నెల 30న నిందితుడు దొంగతనం చేయడం కోసం కరీంనగర్ నుంచి ఎల్లారెడ్డిపేటకు వస్తున్నాడనే సమాచారంతో స్థానిక బస్టాండ్ ప్రాంతంలో అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి వద్ద నుంచి రూ.వేయి నగదుతో పాటు చోరీకి వినియోగించే ఇనుప రాడ్‌ను స్వాధీనపర్చుకున్నారు. విచారించగా పలు ఆలయాల్లో దొంగతనాలను పాల్పడ్డానని అంగీకరించాడు. కేసును ఛేదించడంలో కీలకపాత్ర పోషించిన సీఐ శ్రీనివాస్‌గౌడ్, ఎస్ఐ రమాకాంత్, క్లూస్ టీం ఏఎస్ఐ శరత్, సిబ్బంది బాబయ్య, రాజేందర్, శ్రీనాథ్‌లను డీఎస్పీ అభినందించారు.

డిప్లొమా కోర్సుల కోసం డైట్‌లో ధ్రువపత్రాల పరిశీలన

తిమ్మాపూర్, జూలై30: ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణ సంస్థ(డైట్)లో రెండు సంవత్సరాల కోర్సులైన డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్(డిఇఎల్ఇడి), డిప్లొమా ఇన్ ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్(డిఇఎస్ఈ) మొదటి సంవత్సరంలో 2024-25 చేరేందుకు నిర్వహించిన డిఈఈసెట్-2024 ఫలితాలు వెల్లడైనట్లు డైట్ ప్రిన్సిపాల్ శ్రీరాం మొండయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫలితాలు సంబంధిత వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఉత్తీర్ణులైన పాత కరీంనగర్ జిల్లాకు సంబంధించిన అభ్యర్థులు తమ ఒరిజినల్ ధ్రువపత్రాల పరిశీలన ఆన్‌లైన్ విధానంలో ఆగస్టు 1,2వ తేదీలు రెండు రోజుల్లో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణా సంస్థ(డైట్), కరీంనగర్ జిల్లా, తిమ్మాపూర్ మండలం, ఎల్ఎండీ కాలనీలో జరగనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు తమ డీఈఈసెట్-2024 హాల్ టికెట్, ర్యాంక్ కార్డు, ఎస్ఎస్‌సి, ఇంటర్ మెమోలు, ఇంటర్ వరకు స్టడీ, కుల, ఆదాయ(2024) ధ్రువపత్రాలతో పాటు ఇతర ప్రత్యేక పత్రాలు(పిహెచ్‌సి, ఎన్‌సిసి, సిఏసి ఉంటే) ఒరిజినల్స్ వెంట తీసుకుని రావాలని పేర్కొన్నారు.

షీ టీమ్‌పై అవగాహన

కోల్‌సిటీటౌన్, జూలై 30: గోదావరిఖని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం షీటీమ్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థినులు, యువతులు, మహిళల రక్షణ కోసం ప్రత్యేకంగా షీటీమ్ పని చేస్తుందన్నారు. మహిళలకు, విద్యార్థినులకు ఇబ్బందితే వెంటనే షీటీమ్ వాట్సాప్ నెంబర్ 6303923700కు సమాచారం ఇవ్వాలన్నారు. అలాగే సైబర్ నేరాల విషయంలో జాగ్రత్తగా ఉండాలని, 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. డ్రగ్స్‌కు విద్యార్థులు, యువతరం దూరంగా ఉండాలన్నారు. ఏఎస్ఐ మల్లయ్య, స్నేహలత పాల్గొన్నారు.

దివ్యాంగులకు అన్నదానం

సుల్తానాబాద్, జూలై 30: సుల్తానాబాద్ పట్టణంలోని మానసిక వికలాంగుల పునరావవాస కేంద్రంలోని దివ్యాంగులకు లయన్స్‌క్లబ్ వారు మంగళవారం అన్నదానం చేశారు. లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ ఘట్టమనేని బాబురావు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ అన్నదానం చేస్తున్నట్లు సుల్తానాబాద్ అధ్యక్షుడు మాటేటి సంజీవ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ జూలూరి అశోక్, వెంకటేశం, సాంబమూర్తి, సతీష్, సదానందం, పల్లా అనిల్ కమార్, వెంకటేశం, తుమ్మనవేని సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఈసాలతక్కళ్లపల్లిలో పోస్టాఫీసు మేళా

పాలకుర్తి, జూలై 30 : మండలం పరిధిలోని ఈసాలతక్కళ్లపల్లిలో మంగళవారం పోస్టాఫీసు మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన గోదావరిఖని సబ్‌డివిజనల్ ఇన్‌స్పెక్టర్ ఎస్ శ్రీనాథ్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పోస్ట్ ఆఫీస్ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నారాయణ, గ్రామ మహిళా సంఘం అధ్యక్షురాలు స్రవంతి, శారద, బసంత్‌నగర్ పోస్ట్‌మాస్టర్ ఓదెలు, మెయిల్ ఓవర్సీస్ సతీష్, పోస్ట్‌మ్యాన్ రవిందర్ పాల్గొన్నారు.

రెయిన్ కోట్లు పంపిణీ

పాలకుర్తి, జూలై 30:మండలంలోని బసంత్‌నగర్, ఈసాలతక్కళ్లపల్లి, గుడిపల్లి, జయ్యారం గ్రామాల్లో పర్యటించి పొలాల్లో నాట్లు వేస్తున్న మహిళ కూలీలను మంగళవారం రామగుండం ఎమ్మెల్యే సతీమణి,మక్కాన్ సింగ్ సేవ సమితి చైర్‌పర్సన్ మనాలిఠాకూర్ కలిసి వారితో మందుతోపాటు విత్తనాలు చల్లి కూలీలతో కలిసి నాట్లు వేశారు. ఈ సందర్భంగా మనాలి మాట్లాడుతూ ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ ఆదేశాల మేరకు మహిళ కూలీలకు రెయిన్ కోట్లు పంపిణీ చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముక్కెర శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీపీ గంగాధరి రమేష్‌గౌడ్ పాల్గొన్నారు.

టీ షర్ట్‌ల పంపిణీ

ఓదెల, జూలై 30 : మండలంలోని పొత్కపల్లిలో మంగళవారం ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు తనయుడు గోపి జన్మదినం సందర్భంగా క్రీడాకారులకు టీ షర్ట్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మూల ప్రేమ్‌సాగర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ ఆళ్ల సుమన్‌రెడ్డి, అంబాల కోమురయ్య, చొప్పరి రాజన్న, పడాల రాజు, రాగిడి రవిందర్‌రెడ్డి, సిరిసేటి రాహుల్, కట్కూరి సమ్మిరెడ్డి, మీనుగు సంతోష్, రాకేష్ పాల్గొన్నారు.

రెండో విడత రుణమాఫీ కింద 1123 మందికి లబ్ధి

కాల్వశ్రీరాంపూర్, జూలై 30: లక్ష యాభై వేలలోపు ఉన్న రైతులకు ప్రభుత్వం రెండో విడత రుణమాఫీ చేసిందని మండల వ్యవసాయ అధికారి నాగార్జున తెలిపారు. రెండవ విడుతలో భాగంగా రుణమాఫీ ద్వారా కాల్వశ్రీరాంపూర్‌లో 106, ఎదులపూర్‌లో 416, రాతుపల్లి 44, పెగడపల్లి 272, మడిపల్లి 127, గంగారాం 101, మిర్జంపేట 57, కిష్టంపేట 53, మొట్లపల్లి 32, తారుపల్లి 58, మాల్యాల 50, పందిళ్ళ 73, పెద్దంపేట్ 65, వెన్నంపల్లి 96, మంగపేట్ 50, కూనారం 107, జాఫర్‌ఖాన్‌పేట 14 మొత్తం 1123 మంది రైతులకు రూ.10.75కోట్లు లబ్ధి చేకూరిందన్నారు. రెండు విడుతలు కలిపి 3912 రైతు కుటుంబాలకు రూ.23.71కోట్ల రుణమాఫీ కావడం జరిగిందని తెలిపారు. రుణమాఫీ అయిన రైతులు ఆయా బ్యాంకు మేనేజర్‌ను కలిసి పంట రుణం రెన్యువల్ చేయించుకోవాలని ఆయన రైతులను కోరారు.

విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి

కమాన్‌పూర్, జూలై 30 : గ్రామపంచాయతీ కార్యదర్శులు విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని మండల పరిషత్ సూపరిండెంట్ సురేష్ అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఎఫ్ఏలకు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. పారిశుధ్య నిర్మూలనపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. గ్రామాల్లో పన్నుల వసూళ్లపై శ్రద్ధ పెట్టాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీవో భాస్కర్, ఏపీవో లావణ్య, కార్యదర్శులు ఉన్నారు.

కేజీబీవీని సందర్శించిన నాయకులు

కాల్వశ్రీరాంపూర్, జూలై 30: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలను మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్ స్థానిక నాయకులతో కలిసి పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కస్తూర్బా పాఠశాల అభివృద్ధికి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు రూ.15లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. పాఠశాల ఇబ్బందులు తెలుసుకొని నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ మునీర్, మాజీ జడ్‌పీటీసీ లంక సదయ్య, మాదాసి సతీష్, మొండయ్య, సురేష్ ఉన్నారు.

కాంట్రాక్టు పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

రామగిరి, జూలై 30: మండలంలోని కస్తూర్బా పాఠశాలలో కాంట్రాక్టు బేసిస్‌లో ఖాళీగా ఉన్న పోస్టులకు దరఖాస్తులను కోరారు. ఈ మేరకు కళాశాల యాజమాన్యం ఒక ప్రకటన విడుదల చేసింది. అందులో 2 అసిస్టెంట్ కుక్స్, స్వీపర్, వెట్, స్వీపర్ డ్రై నాలుగు పోస్టులకు ఈనెల 31వ తేదీ నుంచి ఆగస్టు 2లోగా అర్హతగలవారు దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. వివరాలకు కేజీబీవీలో సంప్రదించాలని పేర్కొన్నారు.

చెడు వ్యసనాలకు బానిసకావద్దు

- మంథని సీఐ రాజుగౌడ్



కాసర్లగడ్డలో అవగాహన కల్పిస్తున్న సీఐ రాజుగౌడ్

ముత్తారం, జూలై 30: యువత చెడు వ్యసనాలకు బానిసలు కావద్దని మంథని సీఐ రాజుగౌడ్ అన్నారు. మంగళవారం ముత్తారం మండలంలోని కాసార్లగడ్డలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హజరై ప్రజల్లో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ముఖ్యంగా విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ సమాజానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని సూచించారు. అదేవిధంగా గ్రామాల్లో నాటుసారా, గంజాయి వంటి మాదక ద్రవ్యలకు దూరంగా ఉండాలని సూచించారు. మాదక ద్రవ్యాల సేవనం ద్వార సమాజంలోని యువత విచక్షణ కోల్పోయి మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడుతున్నారన్నారు. యువత చెడు మార్గలను ఎంచుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎస్సై మధుసూదన్‌రావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

మంథని, జూలై 30: ఆటోడ్రైవర్లు ట్రాఫిక్ నియమనిబంధనలు పాటించాలని మంథని సీఐ బి. రాజు సూచించారు. స్థానిక ఆటో స్టాండ్‌లో ఆటో డ్రైవర్లతో సీఐ మంగళవారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ నిబంధనలు, ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆటోడ్రైవర్లు ఇష్టానుసారంగా ఆటోలను రోడ్లపై నిలిపివేసి ట్రాఫిక్, ప్రజలకు ఇబ్బందులు కలిగించవద్దన్నారు. ఆటోలకు కేటాయించిన స్థలాల్లోని పార్కింగ్ చేసుకోవాలన్నారు. ఆటోనంబర్ ప్లేట్లు సైతం కనబడే విధంగా ఉండాలన్నారు. అదేవిధంగా ఆటోలో ఎక్కిన ప్రయాణికులతో ముఖ్యంగా మహిళలతో మర్యాదగా ప్రవర్తించాలన్నారు. ఆయన వెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.

విలేజ్ అంతర్గాంలో కార్డన్ సెర్చ్

అంతర్గాం, జూలై 30: మండల పరిధిలోని విలేజ్ అంతర్గాం గ్రామంలో మంగళవారం పోలీసులు కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని అన్ని ఇళ్లలో సోదాలు నిర్వహించి ధ్రువీకరణ పత్రాలు లేని వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలనుద్దేశించి గోదావరిఖని ఏసీపీ రమేష్ మాట్లాడారు. గ్రామంలో అపరిచిత వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అత్యవసర సమయాల్లో 100పంబర్‌కు ఫోన్‌చేసి పోలీసుల సేవలు పొందాలని సూచించారు. పోలీసులు ఉన్నది ప్రజల రక్షణ కోసమేనని, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకు సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రామగుండం సీఐ ప్రవీణ్‌కుమార్, అంతర్గాం ఎస్ఐ వెంకటస్వామి, పోలీస్ సిబ్బంది పాలొన్నారు.

ఖనిలో గోరింటాకు వేడుకలు



దుర్గానగర్‌లో గోరింటాకు వేడుకలో పాల్గొన్న మహిళలు

కోల్‌సిటీటౌన్, జూలై 30: గోదావరిఖనిలో పలు కాలనీలలో మంగళవారం మహిళలు గోరింటాకు వేడుకలు నిర్వహించారు. స్థానిక దుర్గానగర్‌లో దుర్గా భవాని కిట్టి గ్రూప్ ఆధ్వర్యంలో గోరింటాకు వేడుకను వైభవంగా నిర్వహించారు. మహిళలు ఒక్కచోట చేరి గోరింటాకు పెట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో తూముల రమాదేవి, జె.ఈశ్వరి, ఆర్.స్వప్న, టి.శైలజ, సావిత్రి, పి.జ్యోతి, కె.పద్మ, విజయ, శ్రీలత, సంధ్య, కవిత, మహాలక్ష్మి, బి.లక్ష్మి, మమత పాల్గొన్నారు. అలాగే 12వ డివిజన్‌లో గోరింటాకు వేడుక నిర్వహించారు.కార్పొరేటర్ బొడ్డు రజితరవీందర్ మహిళలు పాల్గొన్నారు.

బైక్ ఢీకొని మహిళకు గాయాలు

సుల్తానాబాద్, జూలై 30: సుల్తానాబాద్ పట్టణంలో రోడ్డు దాటుతుండగా ద్విచక్రవాహనం ఢీకొన్న సంఘటనలో ఓ మహిళకు గాయాలయ్యాయి. పట్టణంలోని కూరగాయల మార్కెట్‌లో కూరగాయలు అమ్ముకునే కనకలక్ష్మి సోమవారం రాత్రి రోడ్డు దాటుతుండగా కరీంనగర్ వైపు నుంచి పెద్దపల్లి వైపు వెళుతున్న ఓ ద్విచక్ర వాహనం ఆమెను ఢీకొట్టింది. కింద పడిపోయిన కనకలక్ష్మి స్పృహ కోల్పోయారు. ఆటుగా వెళుతున్న సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డితో పాటు మాజీ వార్డు సభ్యుడు అమిరిశెట్టి తిరుపతి ఆమెను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రుణమాఫీపై కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు

రామగిరి, జూలై 30: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట ప్రకారం రైతుల రుణమాఫీ చేయడం పట్ల మంగళవారం కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. మండలంలోని రత్నాపూర్ రైతు వేదికలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేక్ కట్ చేసి ఉపాధిహామీ కూలీలకు స్వీట్లు పంపిణీ చేపట్టారు. కాంగ్రెస్ నాయకుడు ఉడుత శంకర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నీరజ తులసిరాంగౌడ్, సోషల్ మీడియా ఇన్‌చార్జి శ్రీధర్, రైతుల పాల్గొన్నారు.

మొక్కలు నాటిన అధికారులు

పెద్దపల్లి రూరల్, జూలై 30 : మండలంలోని బొంపల్లి గ్రామంలో వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మంగళవారం అవెన్యూ ప్లాంటేషన్‌లో భాగంగా మొక్కలు నాటారు. ఈజీఎస్ జేఈ రాజయ్య, పంచాయతీ కార్యదర్శి సంపత్, టెక్నికల్ అసిస్టెంట్ వెంకటేష్, ఫీల్డ్ అసిస్టెంట్ అంజయ్యతో పాటు పలువురు పాల్గొన్నారు.

చట్టాలపై అందరికీ అవగాహన ఉండాలి



బురహాన్‌మియాపేట్‌లో సివిల్‌రైట్స్ డే కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

ఎలిగేడు, జూలై 30 : చట్టాలపై ప్రజలందరికీ అవగాహన కలిగి ఉండాలని డిప్యూటీ తహసీల్దార్ కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని బురహాన్‌మియాపేట్‌లో మంగళవారం సివిల్‌రైట్స్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయల మాట్లాడుతూ అంటరానితనం అమానుషమని కంప్యూటర్ యుగంలో అలాంటి వాటికి తావులేకుండా చూడాలని ప్రజలందరికీ చట్టాలపై పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ జయలక్ష్మి, సాంఘీక సంక్షేమ శాఖ అధికారి అంజయ్య, ఏఎస్సై, అంబేడ్కర్‌సంఘం నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్, జూలై 30: మండలంలోని పెగడపల్లిలో మంగళవారం ఎస్సీ కాలనీలో సివిల్ రైట్స్‌డే కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కాలనీవాసులతో ఏర్పాటు చేసిన సమావేశంలో తహసీల్దార్ జాహెద్‌పాషా వారి సమస్యలను అడిగితెలుసుకున్నారు. రెవిన్యూపరమైన సమస్యలుంటే నేరుగా రెవెన్యూ కార్యాలయం వచ్చి సంప్రదించాలన్నారు. ఇబ్బందులుంటే తమ దృష్టికి తీసుకువస్తే పైఅధికారుల దృష్టికి తీసుకపోతామని వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రాజేందర్, అంగన్ వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, కాలనీవాసులు పాల్గొన్నారు.

కమాన్‌పూర్, జూలై 30 : మండలంలోని పేరపల్లిలో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు అంబటి కనకయ్య, ఎంపీవో భాస్కర్ రావు, ఎంపీడీవో సూపరింటెండెంట్ మునిగంటి సురేష్, ఆర్ఐ గౌతమ్, ఎస్ఐ బాలాజీ, రహీం, సెక్రెటరీ సాయిశ్రీ,ఫారెస్ట్‌అధికారి మాధురి, మాజీ సర్పంచ్ అన్నపూర్ణఅశోక్ తదితరులున్నారు.

బస్సుయాత్ర పోస్టర్ ఆవిష్కరణ

సుల్తానాబాద్, జూలై 30: సింగరేణి పరిరక్షణ యాత్ర పేరిట నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఎం నాయకుడు మోదుంపల్లి శ్రావణ్, పాక మహేష్ తదితరులు పిలుపునిచ్చారు. సీపీఎం ఆధ్వర్యంలో సింగరేణి పరిరక్షణ యాత్ర పేరిట బస్సుయాత్రను ఈనెల 29న మంచిర్యాల జిల్లాలో ప్రారంభించడం జరిగిదని, ఆ యాత్ర పెద్దపల్లి జిల్లాలో ఈనెల 31 ప్రవేశిస్తుందని వివరించారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను సుల్తానాబాద్ పట్టణంలోని చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణలోని బొగ్గు బ్లాక్‌లను సింగరేణికే కేటాయించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే బొగ్గు గనుల వేలాన్ని నిలిపివేయాలన్నారు. యాత్రలో పెద్దఎత్తున ప్రజలు కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నిట్టూరి అంజయ్య, సురేష్ జిల్లాల ప్రశాంత్, రమేష్, వినోద్, నల్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో జీపీ ఉద్యోగులు, ఆశా వర్కర్లు

కాల్వశ్రీరాంపూర్, జూలై 30: హక్కుల సాధన కోసం జీపీ ఉద్యోగులు, ఆశా వర్కర్లు సీపీఎం ఆధ్వర్యంలో హైదరాబాద్ తరలివెళ్లేందుకు సిద్ధమవుతుండగా పోలీసులు మంగళవారం వారిని అదుపులో తీసుకున్నారు. సీపీఎం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మంద రాజేందర్ మాట్లాడుతూ కనీసవేతనం పెంచాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, జీఓ51ను సవరించాలని, వారి హక్కుల సాధన కోసం పోరాటం చేస్తున్న వారిని ప్రభుత్వం అరెస్టు చేయడం శోచనీయమన్నారు. లక్ష్మణ్, అరెస్టు అయిన వారిలో మహేష్, గట్టయ్య, సునీత, గట్టమ్మ ఉన్నారు.

కోల్ ఇండియా స్థాయి వేతనాలు ఇవ్వాలి

- ఐఎఫ్‌టీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి టి.శ్రీనివాస్

జ్యోతినగర్, జూలై 30:దేశంలోని ఎన్టీపీసీ ప్రాజెక్టుల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు కోల్ ఇండియా స్థాయి వేతనాలు చెల్లించాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య(ఐఎఫ్‌టీయూ) జాతీయ ప్రధాన కార్యదర్శి టి.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం ఎన్టీపీసీలోని యూనియన్ కార్యాలయంలో జరిగిన ఐఎఫ్‌టీయూ జిల్లాకమిటీ సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడారు. దేశంలో విద్యుత్ డిమాండ్ అధికంగా ఉందని, ఎన్టీపీసీలాంటి కీలక ప్రభుత్వరంగ సంస్థలో వేలాది సంఖ్యలో కాంట్రాక్టు కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. ఎన్టీపీసీ అన్ని ప్రాజెక్టుల్లో 95 శాతం కాంట్రాక్టు కార్మికులే పని చేస్తున్నారని, 5 శాతం మాత్రమే పర్మినెంటు కార్మికులున్నారన్నారు. రానున్న రోజుల్లో ఎన్టీపీసీని కేంద్ర ప్రభుత్వం ప్రైవేటుపరం చేసేందుకు ప్రయత్నిస్తోందని, ఎన్టీపీసీ షేర్లను బహిరంగ మార్కెట్లో విక్రయానికి పెట్టనుందన్నారు. ఎన్టీపీసీ ప్రాజెక్టులలో ప్రస్తుతం జీవోల ప్రకారం చెల్లిస్తున్న చాలీచాలని జీతాలతో కార్మికులు దుర్భర జీవితాలను గడుపుతున్నారని, వారి జీవన ప్రమాణాలు దిగజారి పోయాయని శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. రోజురోజుకు పెరుగుతున్న నిత్యావసరాల ధరలకు అనుగుణంగా వేతనాలు పెరగకపోవడం అన్యాయమన్నారు. ధరలకు అనుగుణంగా కార్మికుల జీతాలు పెంచాలని, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి, సమాన వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అయితే ఎన్టీపీసీలో అలాంటి పరిస్థితులు కనిపించడం లేదన్నారు. దేశీయ విద్యుత్ రంగంలో ఎన్టీపీసీ కీలక సంస్థగా ఉన్నదని, కోల్ ఇండియా సంస్థలో ఉన్న విధంగా హైపవర్ కమిటీ వేతనాలు ఇవ్వాలన్నారు. అలాగే పర్మినెంటు కార్మికులకు జరిగే వేతన సవరణ ఒప్పంద సమయంలోనే కాంట్రాక్టు కార్మికులకు కోల్ ఇండియా తరహా హైపవర్ కమిటీ వేతన సవరణ చేయాలన్నారు. ఈ విషయంలో హైపవర్ కమిటీ వేతనాలకు సంబంధించి ఎన్టీపీసీ కూడా కమిటీని నియమించి వేతనాలను నిర్ణయించాల్సిన అవసరం ఉందన్నారు.

ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మికుల వేతనాలు, డిమాండ్ల సాధన విషయంలో ఐఎఫ్‌టీయూ జాతీయ కమిటీ దేశవ్యాప్తంగా ఉద్యమాలకు సిద్ధమవుతున్నదని, కార్మిక వర్గం పోరాటాలకు సిద్ధం కావాలని శ్రీనివాస్ పిలుపునిచ్చారు. కెహల్గాం ఎన్టీపీసీ నుంచి ఉద్యమానికి శ్రీకారం చుడుతా మన్నారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిలుక శంకర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఐ.కృష్ణ, జిల్లా అధ్యక్షుడు ఇ.నరేష్, నాయకులు బుచ్చయ్య, రాయమల్లు, వెంకటస్వామి, సుధాకర్, నర్సయ్య, రాజేశం, వెంకటేశ్, నర్సింగరావు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



బస్సు యాత్రను విజయవంతం చేయాలి

యైటింక్లయిన్‌కాలనీ, జూలై 24: సీఐటీయూ ఆధ్వర్యంలో తలపెట్టిన సింగరేణి పరిరక్షణ యాత్రను కార్మికులు విజయవంతం చేయాలని యూనియన్ జిల్లా కమిటీ నాయకుడు ఉల్లి మొగిలి పిలుపునిచ్చారు. మంగళవారం ఓసీపీ-3 కృషిభవన్‌లో బస్సుయాత్ర పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈసందర్భంగా మొగిలి మాట్లాడారు. రాష్ట్రంలోని బొగ్గు గనులను సింగరేణికే కేటాయించాలనే ప్రధాన డిమాండ్‌తో ఈనెల 29న ఖైరిగూడలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం యాత్రను ప్రారంభిస్తారని, ఆగస్టు 5న కొత్తగూడెంలో ముగింపు కార్యక్రమానికి సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఎస్ వీరయ్య ముఖ్యఅతిథిగా హాజరుకానున్నట్టు తెలిపారు. ఎనిమిది రోజుల పాటు జరిగే బస్సుయాత్ర ప్రతి ఏరియాలో వేలం ద్వారా జరిగే నష్టాలను కార్మికులకు తెలియజేసి చైతన్యవంతులను చేయడం ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి కుంట ప్రవీణ్, అధ్యక్షుడు వినయ్, వైస్‌ప్రెసిడెంట్ వెంకన్న, నాయకులు సంపత్, రాంప్రసాద్, నరసింహ, సారంగం, శ్రావణ్, భూమయ్య, వినేష్ పాల్గొన్నారు.

ఎన్టీపీసీ ఉద్యోగిపై పోలీసులకు ఫిర్యాదు

జ్యోతినగర్, జూలై 30 : ఆత్మహత్యాయత్నం చేసిన ఎన్టీపీసీ ఉద్యోగి కె.శ్రీపతిరావుపై యాజమాన్యం స్థానిక పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసింది. మంగళవారం ఎన్టీపీసీ మానవ వనుల ముఖ్య అధికారి ఏజీఎం విజయ్‌కుమార్ సిక్డర్ రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. సోమవారం ఎన్టీపీసీ ఏడీఎం భవనంలోని ఈడీ కార్యాలయానికి మద్యం సేవించి వచ్చిన ఉద్యోగి ఈడీ లేకపోవడంతో వెళ్లిపోయాడని, తిరిగి 12.30 గంటలకు వచ్చి ఈడీ ఆఫీసులోని సోఫాలో నిద్రపోయాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆఫీసులో నిద్రపోకూడదని కార్యాలయ సిబ్బంది వారించారని పేర్కొన్నారు. తట్టి లేపినా లేవకపోవడంతో అతన్ని అంబులెన్సులో ఎన్టీపీసీ ధన్వంతరి ఆసుపత్రికి పంపించామని ఫిర్యాదులో తెలిపారు. ఉద్యోగికి వైద్య పరీక్షలు చేసిన డాక్టర్లు, అతను కొన్ని నిద్రమాత్రలు మింగినట్లు నిర్ధారించారని పేర్కొన్నారు. ఉద్యోగి ఆసుపత్రిలో ఇచ్చిన వాంగ్మూలం ప్రకారం ఉద్యోగి శ్రీపతిరావు ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు నిర్ధారణ అయ్యిందని పేర్కొన్నారు. సదరు ఉద్యోగి గతంలో కూడా ఇదేవిధంగా ఆత్మహత్యాయత్నం చేశాడని, చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఏజీఎం పోలీసులకు విజ్ఞప్తి చేశారు. కాగా, ఎన్టీపీసీ యాజమాన్యం ఫిర్యాదు అందిందని, పరిశీలిస్తున్నామని రామగుండం సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

శ్మశానవాటికను శుభ్రం చేయించిన చైర్‌పర్సన్

మంథని, జూలై 30: స్థానిక గోదావరి నది తీరాన ఉన్న శ్మశానవాటికను మంథని మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రి రమ-సురేష్‌రెడ్డి మంగళవారం శుభ్రం చేయించారు. మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జునస్వామి, పాలకవర్గంతో కలిసి గోదావరి తీరాన్ని, శ్మశానవాటికను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా శ్మశాన వాటికలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని సిబ్బందితో తొలగింపచేశారు. అనంతరం చైర్‌పర్సన్ పెండ్రి రమ-సురేష్‌రెడ్డి మాట్లాడుతూ.. గోదావరి తీరాన్ని నిత్యం పరిశుభ్రంగా ఉంచేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. ఆమె వెంట మున్సిపల్ పాలకవర్గం సభ్యులున్నారు.



శ్మశానవాటికను సందర్శించిన చైర్మన్, కమిషనర్

కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను నెరవేర్చాలి

-బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్

పెద్దపల్లి రూరల్, జూలై 30: కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని బీజేపీ మండల అధ్యక్షుడు మేకల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం బీజేపీ మండల కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా మండల అధ్యక్షుడు మేకల శ్రీనివాస్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటేందుకు బీజేపీ శ్రేణులు సన్నద్ధం కావాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శిలారపు పర్వతాలు, పోచాం, అసెంబ్లీ కన్వీనర్ దాడి సంతోష్, తంగేడ రాజేశ్వర్‌రావు, పోల్సాని సంపత్‌రావు, తిరుపతి, వేల్పుల రమేష్, కందుల సదయ్య, ముంజ రాజేందర్, పడాల శ్రీనివాస్, గాండ్ల రాజేశం, ఉమేష్, సతీష్, వెంకటేష్, ఉపేందర్, సబ్బు మల్లయ్య, వేణు, రవిందర్, పోచాలు, మల్లేష్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

బురద రోడ్డుపై నాట్లు వేసి మహిళల నిరసన

సుల్తానాబాద్, జూలై 30: సుల్తానాబాద్ మున్సిపాలిటీ ఎనిమిదో వార్డు పరిధిలో కొంత మంది మహిళలు తమ ఇండ్ల ముందు బురద మయంగా ఉందని అధికారులు పట్టించుకోవడం లేదంటూ బురదలో నాట్లు వేసి నిరసన వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో బీఆర్ఎస్ మహిళా నాయకురాలు, మార్కెట్ కమిటీ మాజీ చైర్‌పర్సన్ తిప్పారపు కమలాదయాకర్ తదితరులు పాల్గొన్నారు.

● రోడ్డు బురదగా ఉందని నాట్లు వేసిన ఫొటోలు సోషల్ మీడియాలో బీఆర్ఎస్ నాయకుడు దయాకర్ పోస్టు చేయడంతో కాంగ్రెస్ నాయకులు, ప్రస్తుత ఆ వార్డు కౌన్సిలర్ భర్త చింతల రాజు ప్రతిగా పోస్టులు పెట్టారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న మెడికల్ ఆఫీసర్ మాణికేశ్వర్

కళ్యాణ్‌నగర్, జూలై 30: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అడ్డగుంటపల్లి ప్రాథమిక ఆసుపత్రి మెడికల్ ఆఫీసర్ మాణికేశ్వర్‌రెడ్డి సూచించారు. మంగళవారం కళ్యాణ్‌నగర్‌లోని మనుమయ సంఘం భవనంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో ఆయన మాట్లాడుతూ ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమలు, ఈగలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఇంట్లో కూలర్లు, బ్యారెళ్లు, కొబ్బరి చిప్పల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. ఈ సీజన్‌లో వేడివేడి ఆహారం తీసుకోవాలని ఆయన సూచించారు. రోగులను పరీక్షించిన అనంతరం మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో 42వ డివిజన్ కార్పొరేటర్ బాల రాజ్‌కుమార్, ఆడెపు దశరథం, ఏఎన్ఎంలు స్వప్న, సరస్వతి, పద్మ, సుజాత, సమాఖ్య అధ్యక్షురాలు రాజేశ్వరి, హేమలత, మీనాక్షి, ఆర్‌పీ పద్మ, వాసవి, శ్రీకళ పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం

కోల్‌సిటీ, జూలై 30: లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం లక్ష్మీపురం అర్బన్ హెల్త్ సెంటర్ వద్ద వృద్ధాశ్రమంలో అధ్యక్షుడు మల్లికార్జున్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ ఘట్టమనేని బాబురావు జన్మదినం సందర్భంగా మీల్స్ ఆన్ వీల్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కార్యదర్శి ఎల్లప్ప, సభ్యులు తానిపర్తి గోపాల్‌రావు, విజయలక్ష్మి, బంక రామస్వామి, గుండా వీరేశం, పోకల ఆంజనేయులు, తిలక్ చక్రవర్తి పాల్గొన్నారు.

బాబా తాజుద్దీన్ ఉర్సు ఉత్సవం

మంథని, జూలై 30: మంథని బాబా తాజుద్దీన్ సేవా సమితి ఆధ్వర్యంలో సయ్యద్ మహమ్మద్ బాబా తాజుద్దీన్ రహమతుల్లా ఆలే నాగపూర్ 102 ఉర్సు మహోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. గౌస్పాక్ చిల్లా షరఫ్ (పీరిల్ల జెండా) లైన్‌గడ్డలో గంధం చాదర్ ఫాతిహా నిర్వహించి ఊరేగింపుగా స్థానిక గాంధీచౌక్‌లో ఏర్పాటు చేసిన వేదిక వద్దకు చేరుకున్నారు. సాయంత్రం గాంధీచౌక్ నుంచి బస్సు డిపో వరకు గంధం ఊరేగింపు నిర్వహించడంతో పాటు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రి రమ-సురేష్‌రెడ్డి, బాబా తాజుద్దీన్ సమితి సభ్యులు, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

రైతులకు రుణమాఫీ హర్షణీయం

-సింగిల్‌విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్

మంథని, జూలై 30: రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ చేయడం హర్షణీయమని మంథని సింగిల్‌విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ మంగళవారం అన్నారు. ఎన్నికల సందర్భంగా రైతులకు ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం విడతల వారిగా రుణమాఫీ చేస్తున్నదన్నారు. ఇందులో భాగంగా ప్రస్తుతం రూ.1.50లక్షల వరకు ఉన్న రైతులకు రుణమాఫీ ప్రక్రియ చేపట్టడం సర్వత్రా హర్షణీయమన్నారు. రైతుల పక్షాన కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. మంథని కేడీసీసీ బ్యాంకులో మేనేజర్‌గా పని చేస్తున్న దుమ్మని లక్ష్మణ్ మేడిపల్లి బ్రాంచ్‌కు బదిలీ వెళ్తుండగా, మంథని బ్రాంచ్ మేనేజర్‌గా ముత్తారం బ్రాంచ్ నుంచి బదిలీపై వచ్చిన నూతన మేనేజర్ కొంకటి ఉదయశ్రీలను పీఏసీఎస్ చైర్మన్ కొత్త శ్రీనివాస్ శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమాల్లో ఉపాధ్యక్షుడు బెల్లంకొండ ప్రకాష్ రెడ్డి, డైరెక్టర్లు ఆకుల రాజబాపు, పెద్దిరాజు ప్రభాకర్, లెక్కల కిషన్‌రెడ్డి, దాసరి లక్ష్మీ మొండయ్య, ఉడుత మాధవి పర్వతాలుయాదవ్, బ్యాంక్ డీఈ దిలీప్‌కుమార్, టీపీసీసీ ఎలక్షన్ కమీషన్ కో-ఆర్డినేషన్ కమిటీ మెంబర్ శశిభూషణ్ కాచే, మాజీ ఎంపీపీ కొండ శంకర్, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ముస్కుల సురందర్‌రెడ్డి, సీఈవో అశోక్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

రైతువేదికలో సంబరాలు

ఎలిగేడు, జూలై 30: మండల కేంద్రంలోని రైతువేదికలో మంగళవారం రెండో విడుత రుణమాఫీ కార్యక్రమాన్ని రైతులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తిలకించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. దీంతో రైతువేదికలో సంబరాలు చేసుకున్నారు.

అరుదైన వ్యాధితో విద్యార్థి మృతి



ధర్మతేజరెడ్డి(ఫైల్)

ముత్తారం, జూలై 30: ముత్తారం మండలం లక్కారం గ్రామానికి చెందిన నాయిని ధర్మతేజరెడ్డి (19)అనే విద్యార్థి లాంగ్ సెగ్మెంట్ మైలిటిస్ అనే అరుదైన వ్యాధితో మంగళవారం మృతిచెందాడు. లక్కారం గ్రామానికి చెందిన నాయిని రాజిరెడ్డి కుమారుడు నాయిని ధర్మతేజరెడ్డి మందమర్రిలో మైనింగ్ కళాశాలలో మైనింగ్ డిప్లొమా కోర్సు చేస్తున్నాడు. ఈ సంవత్సరం మార్చి 24న ధర్మతేజరెడ్డి తన ఇంట్లో ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. కాళ్లు చేతులు పడిపోయి వాంతులు, విరోచనాలు చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు గోదావరిఖని సింగరేణి ఆసుపత్రికి తరలించగా వైద్యుల సూచనల మేరకు హైదరాబాద్ కేర్ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడి వైద్యులు ధర్మతేజరెడ్డికి పరీక్షలు నిర్వహించి లాంగ్ సెగ్మెంట్ మైలిటిస్ వ్యాధిగా నిర్ధారించారు. దీనిపై స్థానిక ప్రభుత్వ వైద్యుడిని వివరణ కోరగా పది లక్షల్లో ఒకరికి ఇలాంటి వ్యాధి సోకుతుందని ఆయన తెలిపారు. విద్యార్థి మృతితో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరు అయ్యారు.

ఓపెన్ డిగ్రీలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

మంథని, జూలై 30: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎండీ తాహీర్ హుస్సేన్, కో-ఆర్డినేటర్ కర్నాటి కృష్ణలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ(బీఏ/బీకాం/బీఎస్సీ) కోర్సుల్లో 2024-25 విద్యా సంవత్సర ప్రవేశాల కోసం ఆగస్టు 18 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

ఆయా కోర్సుల్లో ప్రవేశాలకు విద్యార్హతలు, ఫీజు తదితర వివరాలను వెబ్‌సైట్ ద్వారా పొందవచ్చునన్నారు. అలాగే ద్వితీయ, తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ట్యూషన్ ఫీజు చెల్లించాలని, డిగ్రీ 2015-16 నుండి 2023-24 వరకు అడ్మిషన్ పొంది ఫీజు సకాలంలో చెల్లించనివారు కూడా ఆగస్టు 18వ తేదీ లోపు ట్యూషన్ ఫీజు చెల్లించా లన్నారు. పూర్తి వివరాలకు అధ్యయన కేంద్రంలో లేదా 7382929649 నంబరులో సంప్రదించాలని వారు సూచించారు.